సాక్షి తిరుపతి
శనివారం । 16 । మార్చి । 2024



కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు తిరుపతి నగరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. - 8లో



ద్విచక్రవాహనం బహూకరణ

తిరుమల శ్రీవారికి ఢిల్లీకి చెందిన హీరో మోటార్స్ నిర్వాహకులు ద్విచక్ర వాహనాన్ని బహూకరించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహార్ ఆదివారం (ఉ)
తిరుపతి	6-26	5-00
గూడూరు	6-25	4-53

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 843 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 87 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 27,123 మంది, ఒకేషనల్‌లో 937 మంది, మొత్తం 28,060 మంది పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా.. జనరల్‌లో 707 మంది, ఒకేషనల్‌లో 136 మంది మొత్తం 843 మంది గైర్హాజరైనట్టు ఇంటర్ ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం 87 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ (బైపీసీ వారికి) పరీక్షలు జరగనున్నట్టు ఆర్‌ఐఓ తెలిపారు.

18న వెంకటగిరిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన (సోమవారం) ఉదయం 9గంటల నుంచి వెంకటగిరిలోని వీఆర్‌జేసీ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్ లేదా ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం డిస్ట్రిక్ట్ ప్లేస్మెంట్ ఆఫీసర్, గణేష్, 9505023016ను సంప్రదించాలని కోరారు.

రీసెట్ దరఖాస్తులకు 19న ఆఖరు

తిరుపతి సిటీ: ఏపీ రీసెట్-23 దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగియనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ దేవ ప్రసాద్‌రాజు తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టిన ఏపీ రీసెట్-2023 దరఖాస్తు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేసవిలో అదనపు సర్వీసులు



చెంగల్‌రెడ్డి, డీపీటీవో

తిరుపతి అర్బన్: వేసవి నేపథ్యంలో ఆర్టీసీ పలు మార్గాల్లో అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ రేణిగుంట-చంద్రగిరికి 10 సర్వీసులు, గ్రామీణ ప్రాంతాలకు 27 సర్వీసులు, 30 కొత్త హైయర్ బస్సులు, అరుణాచలంకు ఒక ఏసీ సర్వీస్, మధురైకి మరో ఏసీ సర్వీస్ ఈనెలలోనే ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచితంగా పరీక్ష ప్రాంతానికి ఆర్టీసీ గ్రామీణ సర్వీసుల్లో ప్రయాణం చేయొచ్చని సూచించారు. వేసవి నేపథ్యంలో తిరుమలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మరోవైపు అన్ని బస్టాండ్లలో తాగునీటి సౌకర్యాలతోపాటు దాతల సాయంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని నాలుగు జెంబో కూలర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తిరుపతి అర్బన్: రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ వాటికి మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను తెలియజేయాలని కలెక్టర్ లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని బాగా అభివృద్ధి చేయడానికి రైతులు తెలుగుగంగనీటిని సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలుండాలని సూచించారు. మిచాంగ్ తుపాన్‌లో నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీతో విత్తనాలు అందించాలన్నారు. ప్రధానంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న అన్ని సేవలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సబ్సిడీ పనిముట్లు అవసరమైన రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. డీఏఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ రబీ 2023-24లో 73,534 మంది రైతులకు 2,02,909 ఎకరాలలో ఈ - క్రాప్ నమోదు పూర్తిచేశామన్నారు. రైతులకు అవసరమైన పురుగు మందులను ఇండెంట్ పెట్టిన 48 గంటల్లోపు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. 7,971 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారిణి గీతారాణి, మైక్రో ఇరిగేషన్‌శాఖ అధికారి సతీష్, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

టికెట్ల లొల్లి.. నేతల వర్రీ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయం రంజుగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల ఎత్తులకు ఆశావహులు చిత్తవుతున్నారు. పార్టీ జెండా మోసి మోసపోయామని కొందరు.. పార్టీ కార్యక్రమాలకు డబ్బులు తగలేసి అప్పుల పాలయ్యామని మరికొందరు రగిలిపోతున్నారు. అధికార పార్టీ ఛీకొట్టిన నేతకు టికెట్ ఎలా ఇస్తారని స్థానిక నేతలు నిలదీస్తున్నారు. స్థానికేతరులకు టికెట్ ఇచ్చి అవమానించారని ఇంకొందరు రుసరుసలాడుతున్నారు.



శ్రీకాళహస్తిలో జనసైనికుల నిరసన ర్యాలీ

- జెండా మోసిన వారు వద్దు.. కొత్త వారే ముద్దంటున్న అధినేతలు
- తిరుపతి, సత్యవేడు జనసేన, టీడీపీ అభ్యర్థుల ఎంపికపై ఆగ్రహ జ్వాలలు
- సత్యవేడులో టీడీపీ శ్రేణుల తిరుగుబాటు
- ఆదిమూలాన్ని మార్చకపోతే టీడీపీకి ఓటమి తప్పదని హెచ్చరికలు
- తిరుపతి టీడీపీ, జనసేన వారికి చిత్తూరు శ్రేణులు చీర, గాజులు పంపుతామంటూ హేళన
- శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ నేతలపై బొజ్జల సుధీర్ వర్గీయుల దాడి
- ఆందోళనకు సిద్ధమైన ఇరు పార్టీల శ్రేణులు

సాక్షి, తిరుపతి: టీడీపీ, జనసేనలో టికెట్ల లొల్లి రాజుకుంది. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కనబెట్టి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికి, అసలు కండువానే కప్పుకోని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ కండువా కప్పుకోకపోయినా చంద్రబాబు సత్యవేడు అభ్యర్థిగా ప్రకటించారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులంతా శుక్రవారం వరదయ్యపాళెం చేరుకుని నిరసన తెలియజేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలించి అమ్ముకున్న ఆదిమూలంకి ఎలా టికెట్ ఇస్తారని చంద్రబాబుని ప్రశ్నించారు. మొన్నటి వరకు ఆదిమూలం అవినీతిపరుడని చెప్పిన తాము ఇప్పుడు కోనేటికి ఓటేయమని ఎలా అడగాలని నిలదీస్తున్నారు. స్థానిక ప్రజలకు సేవచేయడంలో విఫలమయ్యారని తెలుసుకున్నాకే ఆయన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టానం పక్కనపెట్టిందని గుర్తుచేశారు. అటువంటి నేతను టీడీపీ అభ్యర్థిగా ఎలా నియమిస్తారని ఆ పార్టీ శ్రేణులు ధ్వజమెత్తారు. సత్యవేడు అభ్యర్థి తానేనని నాలుగేళ్లుగా ఖర్చు చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ అయితే రెండు రోజులుగా నివాసానికే పరిమితమై బోరున విలపిస్తున్నట్లు సమాచారం. సత్యవేడు అసంతృప్తి నేతలంతా నేడు సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. వీరితో పాటు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.

తిరుపతి నేతలకు తీవ్ర అవమానం

చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులు అనుచరులు తిరుపతి జనసేన నేతలను తీవ్రంగా అవమానించినట్లు తెలిసింది. జనసేనకు తిరుపతి అసెంబ్లీని కేటాయించినా.. పోటీ చేసేందుకు బలమైన నాయకులు లేరని, అందుకే చిత్తూరు నుంచి చీరలు, గాజులు పంపిస్తున్నామంటూ అవమానించారంటూ జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ పార్టీ నాయకుల అంతర్గత సమావేశంలో వెల్లడించారు. ఈ విషయంపై తిరుపతికి చెందిన టీడీపీ, జనసేన శ్రేణులు భగ్గుమంటున్నారు. ఆరణి శ్రీనివాసులకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ తీర్మానం చేసి ఆ లేఖను అమరావతికి పంపినట్లు తెలిసింది. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఓ కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. సాయంత్రం తిరుపతి నగరంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. చివరకు అధిష్టానం తిరుపతి టీడీపీ, జనసేన నేతలకు సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో మిన్నకుండిపోయారు. ఆ వెంటనే సమావేశం, నిరసన ర్యాలీలు రద్దు చేసినట్లు ప్రకటించి ఆరణి శ్రీనివాసులు కోసం తామంతా కలిసి పనిచేస్తామని పసుపులేటి హరిప్రసాద్ ఓ వీడియో రిలీజ్ చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చంద్రబాబు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని సమాచారం. ఇంకా టికెట్ ఆశించిన తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

శ్రీకాళహస్తిలో జనసేన వర్సెస్ టీడీపీ

శ్రీకాళహస్తి టికెట్ బొజ్జల సుధీర్‌రెడ్డికి కేటాయించడంతో టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి జనసేన కార్యాలయం ముందు బాణసంచా పేల్చి హంగామా చేశారు. జనసేన నాయకురాలు వినూత, అనుచరులను రెచ్చగొట్టేల వ్యవహరించారు. దీనిపై ప్రశ్నించడంతో బొజ్జల అనుచరులు జనసేన శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. ఇంతజరిగినా అధిష్టానం నుంచి కనీసం పలకరింపు కూడా లేకపోవడంతో జనసేనకు రాజీనామా చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇదిలా ఉంటే పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారని భావించి కోలా ఆనంద్ కొద్ది రోజులుగా ప్రచారం కూడా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరినా ప్రయోజనం లేకుండా పోయింది. వీరంతా నేడు వారి అనుచరులతో సమావేశం కానున్నారు.

నిరసన ర్యాలీ

శ్రీకాళహస్తి టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నాయకులు శుక్రవారం రాత్రి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

యాదవులకు చుక్కెదురు

పొత్తులో భాగంగా పుంగనూరు నుంచి తానే పోటీలో ఉంటానని చిత్తూరు జిల్లా పుంగనూరుకు రామచంద్రయాదవ్ చెప్పుకుంటూ వచ్చారు. బీజేపీ నుంచి లేదా జనసేన అభ్యర్థి తనేనని ప్రకటించుకున్నారు. చివరకు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డినే ఖరారు చేయడంతో యాదవ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీవై పార్టీ పేరుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంటే.. వెంకటగిరి టికెట్ ఈ సారి బీసీలకు కేటాయించాలని మస్తాన్‌యాదవ్, మరికొందరు చేనేత కార్మికులు ప్రయత్నాలు చేశారు. పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబుని కలిసి విన్నవించారు. రా కదలి రా సమయంలో కూడా బీసీలంతా ఏకమై చంద్రబాబుని కలిసి విన్నవించారు. ఆ తరువాత కూడా సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానం చేసి, ఆ కాపీని టీడీపీ అధిష్టానానికి పంపారు. అయినా ప్రయోజనం లేదు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెండో భార్య కుమార్తె లక్ష్మీసాయి ప్రియ పేరును ప్రకటించడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి డాలర్ దివాకర్‌రెడ్డి చంద్రగిరి నుంచి పోటీ చేయాలని గత కొంత కాలంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేస్తూ వచ్చారు. తరుచూ ఆత్మీయ సమావేశాలు కూడా ఏర్పాటు చేసి నజరానాలు అందిస్తూ పలువురి దృష్టిలో పడేందుకు కిందామీదా పడ్డారు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన పులివర్తి నానికి టికెట్ కేటాయించడంతో రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు ఆగ్రహంతో ఉన్నారు.

శాశ్వత చిరునవ్వు



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



హాజరైన లబ్ధిదారులు

- ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి
- తిరుపతి రూరల్ మండలంలో 11,711 మంది లబ్ధిదారులు
- ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం
- ప్రజా సంక్షేమానికి సంకల్పించే ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపు
- పండుగ వాతావరణంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

తిరుపతి రూరల్: పేదవాడి సొంతింటి కల సాకారం దిశగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం అమలవుతోందని స్పష్టం చేశారు. నిరుపేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. శుక్రవారం పండుగ వాతావరణంలో.. తిరుపతి రూరల్ పరిధిలోని 11,711 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను తుడా చైర్మన్ పంపిణీ చేశారు. ఇందుకు తిరుపతి రూరల్ మండల కార్యాలయ ఆవరణంలోని సమావేశ మందిరం వేదికైంది. మండలంలోని పలు పంచాయతీల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న మహిళలు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మహిళలకు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో వారితో కలిసి భోజనం చేశారు.

ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి సంకల్పించే ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని మహిళలకు పిలుపునిచ్చారు. నిరుపేదల పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా పట్టణాలే నిర్మితమయ్యాయని కొనియాడారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు శరవేగంగా చర్యలు చేపట్టిందన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లను అందచేసిందన్నారు. ఇళ్ల స్థలాల మ్యాపింగ్, జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్, జాబ్ కార్డ్ అప్లికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసినట్టు వెల్లడించారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని 11,711 మంది లబ్ధిదారులకు బ్రాహ్మణపట్టు, కొత్తూరు, దుర్గసముద్రం, కొటాల, ఐతేపల్లి, తొండవాడ, సంజీవరాయపురం, నెన్నూరు, సీతారాంపురం, చిందేపల్లిలోని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. నేడు ఒక్కో ఇంటి స్థలం విలువ రూ.10 లక్షలు ఉంటుందన్నారు. గత ప్రభుత్వాల కన్నా భిన్నంగా నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలకు ఎటువంటి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం గొప్ప విషయంగా అభివర్ణించారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే సీఎం జగనన్నను గెలిపించుకునేందుకు ప్రతి మహిళా సంకల్పించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడిగా, ప్రజలే తన కుటుంబ సభ్యులుగా ప్రజాసేవకు తరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ వేముల యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ మెహబూబ్ చాంద్ బీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాంత సేవ



- ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవర్లను చిన్నపల్లకీలో స్వామివారి ఆవరణంలో నుంచి అమ్మవారి శయన మందిరానికి చేర్చారు. అనంతరం అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను ఉంచి ఊయల ఊపుతూ ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన



ప్రారంభిస్తున్న జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి

తిరుపతి సిటీ : వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి పార్థసారథి సూచించారు. శుక్రవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, జిల్లా వినియోగదారుల వ్యవహారాలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, కామర్స్ విభాగం హెడ్ వై.మల్లికార్జున్‌రావు, జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు పీ.రాజారెడ్డి, ఏఎస్‌ఓ రెడ్డి చంద్రిక, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు రూ.20 లక్షలు



ప్రో కబడ్డీ విజేతలకు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి ఆర్కే.రోజా

నాగలాపురం: ఆడుదాం ఆంధ్రా ప్రో కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన నాగలాపురం కబడ్డీ జట్టుకు చెందిన సుమన్, సతీష్‌కు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున ఇద్దరికి రూ.20 లక్షల చెక్కును రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే.రోజా చేతులమీదుగా శుక్రవారం తమ నివాసంలో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామ్, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, వార్డు మెంబర్ ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ రాజా పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 30,921 మంది విద్యార్థులు
- డీఈఓ డాక్టర్ వీ.శేఖర్



డాక్టర్ వీ శేఖర్, డీఈఓ, తిరుపతి

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పది పబ్లిక్ పరీక్షలను తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాల్లో ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 27,012 మంది, ప్రైవేటు 3,909 మంది, మొత్తం 30,921మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల కోసం 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డీఓలు, 1,666 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్టు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం బల్లలు, తాగునీరు, అలాగే ఏఎన్‌ఎంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, ఆ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను అదే తేదీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి 7, ఇంటర్ పరీక్షకు 13, మొత్తం 20 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈఓ తెలిపారు. పదో తరగతి పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 1,611 మంది, ఇంటర్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 3,235 మంది, మొత్తం 4,846 మంది హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణపై ఆదేశాలు ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వాహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ -2 పరీక్షలు జరుగుతాయన్నారు. పేపర్ -1 పరీక్ష ఉదయం 9 నుంచి 9.45 గంటల వరకు, పేపర్ -2 పరీక్షకు మధ్యాహ్నం 1 నుంచి 1.45 వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి నగరం, రూరల్ పరిధిలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 9,377 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. 16 మంది లైజన్ ఆఫీసర్ లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 9000665565, 9676928804లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఆయన వెంట డీఆర్వో పెంచలకిషోర్, తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగిన మెమో రైలు



డీవీ సత్రం రైల్వే స్టేషన్‌లో రైలు ఇంజిన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో మెమో రైలు మరమ్మతులకు గురై శుక్రవారం ఆగిపోయింది. తర్వాత చెన్నైకి సుమారు రెండు గంటల తర్వాత ఆలస్యంగా వెళ్లింది. స్థానిక రైల్వే సిబ్బంది కథనం.. నెల్లూరు నుంచి చెన్నైకి (నం.06746) వెళ్లే మెమో రైలు మండలంలోని నెలబల్లి గ్రామ సమీపంలో ఇంజిన్‌పై ఉన్న ఓహెచ్‌ఎస్ స్టేడ్ (విద్యుత్‌ను అందించే పరికరం) మరమ్మతులకు గురికావడంతో నెమ్మదిగా డీవీ సత్రం రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి స్టేడ్ పూర్తిగా విరిగిపోయింది. విషయం తెలుసుకున్న స్టేషన్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో చెన్నై నుంచి సిబ్బంది వచ్చి స్టేడ్‌కు మరమ్మతులు చేపట్టారు. డీవీ సత్రంలో మధ్యాహ్నం 12 గంటలకు ఆగిపోయిన మెమో రైలు తిరిగి 2 గంటలకు చెన్నైకి బయలుదేరి వెళ్లింది.

17న రెజ్లింగ్ జిల్లా బాలికల జట్టు ఎంపిక

నాయుడుపేట: తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 17న ఉదయం 10 గంటలకు రెజ్లింగ్ జిల్లా బాలికల జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు రెజ్లింగ్ సంఘ జిల్లా అధ్యక్షులు సురేష్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అండర్- 20 బాలికల విభాగంలో జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారిణులు 2004, 2005, 2006లో జన్మించి ఉండాలని తెలిపారు. బాలికల ఫ్రీ స్టైల్ విభాగంలో 50, 53, 55, 57, 59, 62, 65, 68, 72 కేజీల విభాగాలలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపిక పోటీలకు వచ్చే బాలికలు ఆధార్, 10వ తరగతి మార్కులిస్టు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. వివరాలకు 90000 24837 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



గిరిధర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నూకతోటి రాజేష్



కండువాలు వేసి, నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని రాజులపాళెం ఎస్సీ కాలనీలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలకుపైగా నాయకులు, కార్యకర్తలు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రాజులపాళెం ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన టీడీపీ నాయకులు పవన్‌కుమార్, శంకరయ్య, విజయ్‌కుమార్, రత్నమ్మ, ఆదిలక్ష్మి, దుర్గాప్రసాద్, పావని, కుమారి, రమ్య, లావణ్య, పోలమ్మ, సుమతి, కావమ్మ, మంగమ్మ, గురవమ్మ, గంగయ్య తదితర 50 కుటుంబాలకు పైగా ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ సుబోష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటాద్రి, మూర్తి, శంకరయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీజేపీ, టీడీపీ నేతల చేరిక

వరదయ్యపాళెం: మండలంలో బీజేపీ కీలక నేతగా ఉన్న వెంగరెడ్డికండ్రిగకు చెందిన గిరిధర్‌రెడ్డి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలో శుక్రవారం పర్యటించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే వెంకటరెడ్డికండ్రిగలో టీడీపీకి చెందిన కృష్ణమనాయుడు తన అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దొరవారిసత్రం: తుంగమడుగు గ్రామం నుంచి బోలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.63 వేల విలువ చేసే 3,520 కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం సివిల్ సప్లయ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఎస్ డీటీ ఓబయ్య కథనం.. తుంగమడుగు గ్రామ పరిసర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సేకరించి బోలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న విషయంపై సమాచారం అందడంతో విజిలెన్స్ పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. వ్యాన్‌తో పాటు బియ్యం, డ్రైవర్ మురళిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వ్యాన్‌ను సూళ్లూరుపేట మార్కెటింగ్ శాఖకు అప్పగించినట్లు డీటీ తెలిపారు. ఈదాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణనాయక్, సిబ్బంది సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, బొలేరో వ్యాన్

ఏర్పేడు : మండలంలోని ఆమందూరులో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు మండలంలోని ఆమందూరులో వెళుతున్న ఏపీ03టీహెచ్ 0933 నంబరు కలిగిన లగేజీ ఆటోను ఆపారు. ఆటోలో 4,430 కిలోల బరువు గల 93 రేషన్ బియ్యం బస్తాలను గుర్తించారు. వీటి విలువ రూ.1.60 లక్షలు ఉంటుంది. స్వాధీనం చేసుకున్న అక్రమ రేషన్ బియ్యం, వాటిని తరలిస్తున్న చంటి, రామాంజనేయులును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ తిరుమలేశ్వరికి అప్పగించి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు రిజిస్ట్రేషన్

తిరుపతి అర్బన్: ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అర్హులైన వారు మీ పరిధిలోని సచివాలయంలో ఏప్రిల్ 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి యూ.చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో గుర్తింపు పొందిన స్కూల్స్‌లో చదువుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. అయితే అపరిశుభ్ర పనిలో జీవించేవారు, మాన్యువల్ స్కావెంజర్స్, టాన్నర్ అండ్ ఫ్లేయర్స్, వేస్ట్ పిక్కర్స్, హజార్డోస్ క్లీనింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు. డేస్ స్కాలర్ పిల్లలకు ఏడాదికి రూ.3 వేలు, హాస్టల్‌లో ఉంటున్న వారికి ఏడాదికి రూ.8వేలు ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు.

జనరల్ మేనేజర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

తిరుపతి(అలిపిరి) : తిరుపతి టీటీడీ ఎంప్లాయిస్ కో - ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లో జనరల్ మేనేజర్ పోస్టు కోసం ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లోని రూమ్ నం.145 లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు అధ్యక్షులు చీర్ల కిరణ్ తెలిపారు. కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా.. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన వారు, 65 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.30 వేల జీతం ఉంటుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నం.9989033100, 99897 59044లలో సంప్రదించాలని కోరారు.

టీటీడీకి ద్విచక్ర వాహనం బహూకరణ

తిరుమల: తిరుమల శ్రీవారికి శుక్రవారం ద్విచక్ర వాహనం కానుకగా అందింది. ఢిల్లీకి చెందిన హీరో మోటార్స్ కార్పొరేషన్ నిర్వాహకులు రూ.1.30 లక్షలు విలువైన హీరో ఎక్స్‌ట్రీమ్ 125 సిసి ద్విచక్ర వాహనాన్ని అందజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో హీరో మోటార్స్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీషా ఈ మేరకు ద్విచక్ర వాహనం తాళాలను ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల డీఐ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాన్ని అందజేస్తున్న దాతలు

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్‌ని నిర్వహించారు. కేంద్రం నుంచి వచ్చిన బీఎస్ఎఫ్, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నగర వీధులను కవర్ చేస్తూ కనిపించారు. జిల్లాలోని అలిపిరి, రామచంద్రాపురం, చంద్రగిరి, శ్రీకాళహస్తి స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ సాగింది.



ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగయ్య, ప్రమాదానికి కారణమైన కారు

శ్రీకాళహస్తి : కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారి తొట్టంబేడు మండలం, లింగమనాయుడుపల్లి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం.. లింగమనాయుడుపల్లి గ్రామానికి చెందిన గంగయ్య(34), శేషాద్రి(26) శ్రీకాళహస్తి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. సరిగ్గా లింగమనాయుడుపల్లి సమీపానికి చేరుకోగానే తిరుపతి నుంచి విశాఖపట్టణం వెళుతున్న ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగయ్య కాలుకు తీవ్రగాయం కాగా శేషాద్రికి రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి స్వాధీనం

రేణిగుంట: తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర సమక్షంలో ఎస్‌ఈబీ సిబ్బంది శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు, తిరుపతి రూరల్ ఎస్‌ఈబీ సీఐ లింగం, ఎస్‌ఐ అశోక్‌కుమార్, సిబ్బంది రవి, చిరంజీవి, మహేష్, అశోక్, కుమార్ రేణిగుంట రైల్వే స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో గంజాయితో ఉన్న తమిళనాడు రాష్ట్రం, కడలూరు జిల్లాకు చెందిన శివప్రకాశం(35) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆపై నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఈబీ పోలీసులు

పురపాలక సంఘ కార్యాలయము, వెంకటగిరి

ఆర్.ఓ.సి.నెం.522/2015/ఏ1 తేది: 13-03-2024

బహిరంగ వేలం ప్రకటన

వెంకటగిరి పురపాలక సంఘమునకు సంబంధించిన చేపల చెరువులను **2024-2025 సంవత్సరమునకు** సంబంధించి వేలం నిర్వహించవలసియున్నది. వెంకటగిరి పురపాలక సంఘ పరిధిలో **1) అమ్మవారిపేట చెరువు 2) చెవిరెడ్డిపల్లి చెరువు 3) పెరియవరం మరియు మరాటపల్లి చెరువు 4) మనులాలపేట చెరువు 5) కుమ్మరగుంట చెరువు 6) ధర్మాపురం చెరువు 7) పోలిశెట్టిగుంట చెరువులలో** చేపలు పట్టుకొను హక్కునకు **వేలము పాట తేది.22-03-2024న ఉదయం 11.00 గంటలకు** వెంకటగిరి పురపాలక సంఘ కార్యాలయము నందు **బహిరంగ వేలం** నిర్వహించబడును. సదరు వేలం పాటలో పాల్గొను పాటదారులు **రూ.5000/-లు** చొప్పున ధరావత్తు చెల్లించి వేలము పాటలో పాల్గొనవలయును. ఇతర వివరములు కార్యాలయ పనివేళలలో తెలుసుకొనవచ్చును.

గమనిక : యన్.టి. మత్స్యకారులకు బహిరంగవేలంపాట నుండి మినహాయింపు కలదు. మరియు మద్దతు ధరకు తీసుకొనుటకు అంగీకరించినచో వారికి మంజూరు చేయబడును.

సం/- **కమీషనరు**, వెంకటగిరి పురపాలక సంఘము

పాదరక్షల దొంగ అరెస్ట్

తిరుమల: తిరుమలలో పాదరక్షల చోరీకి పాల్పడే ముఠాలోని ఓ సభ్యుడిని టీటీడీ నిఘా భద్రతా సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక ప్రధాన కల్యాణకట్ట వద్ద బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని టీటీడీ భద్రతా సిబ్బంది గుర్తించి అతని బ్యాగును తనిఖీ చేయగా 30 జతల పాదరక్షలు ఉన్నాయి. వీటిని సదరు నిందితుడితోపాటు మరో ఐదుగురు బృందంగా ఏర్పడి చోరీచేసి విచారణలో తేలింది. అనంతరం నిందితుడిని తిరుమల క్రైం పోలీసులకు అప్పగించారు. పోలీసులు ప్రస్తుతం నిందితుడిని విచారిస్తున్నారు.



పాదరక్షలు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ సిబ్బంది

APSRTC

SHORT TENDER NOTICE

Tenders are invited through ... N.I.T. NO.28/CE/APSRTC/2023-24, Dt.14.03.2024 ...

బహిరంగ వేలం ప్రకటన

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టర్, తిరుపతి వారి ఉత్తర్వులు Roc.నెం.సి/33/2024 తేది:13.03.2024 తిరుపతి జిల్లా లోని మొత్తం 12 మండల స్టాక్ పాయింట్స్ నందు సీజు చేయబడి స్వాదీన పరుచుకుని నిల్వ చేయబడియున్న బియ్యము.

1. వినియోగానికి అనువుగా వున్నవి: 454.91 క్వింటాళ్ళ మరియు
2. వినియోగానికిఅనువుగా లేనివి: 69.97 క్వింటాళ్ళ, మొత్తం వెరశి 524.88 క్వింటాళ్ళ

సీజు చేయబడి స్వాదీన పరుచుకున్న బియ్యం బహిరంగ వేలం వేయుటకు నిర్దేశించిన ప్రకారం మండల స్థాయి గోదాములలో (1. పుత్తూరు 2. తిరుపతి 3. చంద్రగిరి 4. పాకాల 5. శ్రీకాళహస్తి 6. సత్యవేడు 7. పిచ్చాటూరు 8. గూడూరు 9. నాయుడుపేట 10.సూళ్ళూరుపేట 11.వెంకటగిరి 12. వాకాడు) బియ్యం ఉన్నవి.

పై తెలిపిన మేరకు సీజు చేయబడి స్వాదీన పరుచుకున్న బియ్యంను **తేది 20.03.2024న** బహిరంగ వేలము జరపబడును. వేలం నందు పాల్గొనదలచిన వారు ముందుగా దరావత్తు రూ. లక్ష రూపాయలు(రూ. 1,00,000/-) డిమాండ్ డ్రాఫ్టు రూపంలో 'జిల్లా పౌర సరఫరాల అధికారి, తిరుపతి' వారి పేరిట చెల్లించి, **తేది: 19.03.2024 లోపు ఈ కార్యాలయం పని దినములలో, పని వేళల్లో అప్లికేషన్ పొంది బహిరంగ వేలం నకు సంబంధించిన నియమ నిబంధనలు మరియు షరతులు నకలు పొందవలెను. బియ్యం "ఎచ్చట ఏవిధంగా వున్నదో అచ్చట నుండి ఆ విధంగానే"** పొందవలెను.

ఈ బహిరంగ వేలం అనేది శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టర్, తిరుపతి వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

వేలం జరుగు ప్రదేశం : **జిల్లా సంయుక్త కలెక్టరు వారి కార్యాలయం, కలెక్టరేట్, తిరుపతి జిల్లా.** తేది : **20.03.2024** సమయం : **ఉదయం 11.00 లకు**

వివరాలకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, తిరుపతి వారిని సంప్రదించవలెను: 9490737878

జిల్లా సంయుక్త కలెక్టర్ వారి తరపున, తిరుపతి జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA, Regular/lateral entry.9381287629

Real Estate

■ 1000 ఎకరాల శ్రీ గంధం ఫార్మ్ లాండ్ ప్రాజెక్ట్ మార్కెటింగ్ చేయుటకు రియల్ ఎస్టేట్/ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, టీచర్లు కావలెను. క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్. నెలకు కనీసం 2 లక్షలు సంపాదించే అవకాశం. కాల్: 9121423425

BUILDING FOR SALE

■ గూడూరు ఐ.సి.యస్ రోడ్డులో 47 అంకణముల స్థలము 120అంకణముల కట్టుబడి కలిగిన 3అంతస్థుల భవనము అమ్మకమునకు కలదు. ఫోన్: 99126 24814.

FLATS FOR SALE

■ తిరుపతి రేణిగుంట రోడ్ నారాయణాద్రి హాస్పిటల్ ఎదురుగా SVR అపార్ట్‌మెంట్ నందు Flats అమ్మకమునకు ఉన్నవి. లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 94417 97690

PLOTS FOR SALE

■ 450 ఎకరాల తిరుమల తిరుపతి దేవస్థాన ఉద్యోగుల ఇళ్ళ స్థలాల ప్రక్కన అయ్యోర్యటౌన్‌షిప్ నందు తిరుపతి ఐటిఐ దగ్గర ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు ✆ 9502774175, 7995992114

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

■ తిరుపతి నుండి కేవలం 6 KM లో ఖరీదైన CPR & విష్ణు ప్రియా విల్లాస్, అకార్డ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, ఎమరాల్డ్, శ్రీ చైతన్య కాలేజీస్ దాటగాన సి.రామాపురం వద్ద 100 అ॥ రోడ్డు ట్రైన్ టెంపుల్ ప్రక్కన, శ్రీ పద్మావతి లీలా కృష్ణ గార్డెన్స్ ఫేజ్-1 నందు ఇల్లు, విల్లా, అపార్ట్‌మెంట్ కట్టుకునే తుడా అప్రూవ్డ్ లేఅవుట్ వెనుక మా ఫేజ్-2 నూతన వెంచర్ త్వరలో ప్రారంభం ప్లాట్స్ రిజర్వేషన్ బుకింగ్స్‌కు సంప్ర ✆ 7386143336

TO-LET

■ తిరుపతి, గ్రాండ్ వరల్డ్ దగ్గర, ఉపాధ్యాయ నగర్, 12వ క్రాస్, డి.నెం.20-8-275, గ్రౌండ్ ఫ్లోర్ &1వ ఫ్లోర్ 3BHK బాడుగకు ఇవ్వబడును. ✆ 9908837042, 7989158397

Services

బంగారం కొనబడును

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

Wanted

■ Marketing Experienced Executives for Car loans Salary 15K to 25K + Incentives Tirupati, Chittoor, Madanapalle Location: 9030100111

■ సూళ్లూరుపేట దగ్గర ప్రముఖ కాఫీ పరిశ్రమలో ఆఫీస్ బాయ్స్ మరియు ప్యాకింగ్ లో పని చేయుటకు ఆడవారు కావలెను. సంప్రదించండి. 9848977496, 9298011777, 8096262777

■ Wanted Front Office Manager, Account Manager, Room Boys, Hotel Sunil Krishna, Old Tiruchanoor Road, Tirupati, 80999 80999, 88866 02345.

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. 9502815217, 9059663584

■ IRP Infra Tech (P) Ltd., నందు A.P. లోని అన్ని జిల్లాల్లో పనిచేయుటకు Electrical & Civil Engineers కావలెను. Exp : 0 to 10 Yrs. Telecom రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. Salary : 20,000/- to 60,000/- Month. Contact : ✆ 82973 13300, 82973 13377

■ ట్రాన్స్‌ఫార్మర్స్ వైండింగ్ & అసెంబ్లింగ్ కోసం ఫ్రెషర్స్ ITI అప్రెంటీస్ కావలెను. ట్రైనింగ్ పీరియడ్ జీతం: 12K. Ph: 9440807020, 9440940940

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463.

■ కిడ్నాప్స్ కాదు VIP ఇళ్లో పెద్దవాళ్లను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్ +91 7995884445

■ Wardens & Electrician Required For Boys Hostels Chennai. Intermediate Pass or Any Degree. Free Food & Accommodation. Sal: 12k - 15k. Electrician (15k- 17k). Ph: 9440551454

■ ARIES Agro Ltd (RMPL) Tirupati, need Dispatch clerk (degree), Accounts (M.Com) with 3yr exp. Attend Interview on 17-3-2024 at RMPL, Dhanalakshmi Nagar, Tirupati. Ph: 9137525183, 8919902617. Email: staff-bala5@gmail.com

■ Wanted Paediatrician, ENT Surgeon, Hospital Administrator, Marketing Manager For Multi Speciality Hospital - Ongole. Whatsapp C.V ✆ 98495 95190

గమనిక

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఏర్పేడు : స్థానిక పాయిల్‌సెంటర్ గ్రామంలో శుక్రవారం అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ జిలానీ పాయిల్‌సెంటర్‌లోని భానుమతి చిల్లర దుకాణంలో సోదాలు జరిపినట్లు చెప్పారు. షాపులో అక్రమంగా నిల్వ చేసిన 11 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని దుకాణం యజమానిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

ఏర్పేడు : మండలంలోని పల్లంపేటలోని ఓ జనరల్ స్టోర్‌లో చోరీ జరిగినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. శ్రీకాళహస్తి మండలం, పాపనపల్లి గ్రామానికి చెందిన చితం భక్తవత్సలం పల్లంపేటలో జనరల్ స్టోర్, షామియానా దుకాణాలు నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి దుకాణం వెనుక వైపు ఉన్న తలుపు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి రూ.52 వేల నగదు, పలు రకాల నిత్యావసర సరకులు అపహరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 48,444 మంది స్వామివారిని దర్శించుకోగా 23,266 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎన్నికల కోడ్ అమలుపై సమీక్ష

తిరుపతి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై చంద్రగిరి ఎన్నికల అధికారి, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి శుక్రవారం సమీక్షించారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించబడిన డీఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల పవిత్రతను కాపాడడంలో ప్రతి ఒక్క అధికారి భాగస్వామి కావాలని కోరారు.

16 నుంచి ఒంటిమిట్ట శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలు


తిరుపతి(అలిపిరి): వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన అధికారులతో కలిసి ఒంటిమిట్టకు చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అనంతరం జేఈవో మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏప్రిల్ 22వ తేదీ శ్రీకోదండరాముడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణరెడ్డి, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.



ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

భూమన అభినయ్ హుందాతనం

సాక్షి, తిరుపతి: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, జనసేన తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అనుకోకుండా ఒకరికొకరు ఎదురుపడ్డారు. అభినయ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెలుపలకు వస్తున్న సమయంలో ఆరణి శ్రీనివాసులు కనిపించారు. ఆయన పలకరించకపోయినా.. అభినయ్‌రెడ్డి నేరుగా వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. 'జనసేన అభ్యర్థిగా ఖరారైందని తెలిసింది అభినందనలు అంకుల్' అని రెండు చేతులతో నమస్కరించారు. ఆరణి శ్రీనివాసులు కూడా రెండు చేతులతో ప్రతి నమస్కారం చేసి 'థ్యాంక్యూ అభినయ్' అని కృతజ్ఞతలు తెలిపారు. ఆరణి శ్రీనివాసులు, వారి అనుచరులకు అభినయ్ ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు చేసి హుందాగా వ్యవహరించారు.



ఎదురుపడ్డ ఆరణి శ్రీనివాసులుకి నమస్కరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

గ్రామపంచాయతి కార్యాలయము, చంద్రగిరి

తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, చంద్రగిరి గ్రామ పంచాయతీ.

వేలము నోటిఫికేషన్

రె.క.నెం. 06A/Auctions/2024 తేది: 15-03-2024

ఇంతకు పూర్వము ఇందు నిమిత్తము జారీ చేయబడిన యావత్తు నోటిఫికేషన్ మరియు నిబంధనలు ఇందుమూలముగా రద్దు గావించి బడి ఈ నోటిఫికేషన్ చంద్రగిరి గ్రామ పంచాయితీచే తీర్మానము సంఖ్య 46, తేది: 16-02-2024 గల తీర్మానము నందు ఆమోదించబడినది.

2024 సం॥రము ఏప్రిల్ నెల 1వ తేదీ మొదలు 2025 సం.. రము మార్చినెల 31వ తేది వరకు కూడిన ఒక సంవత్సరమునకు చంద్రగిరి గ్రామ పంచాయితీకి చెందిన 1) వారపుసంత 2) ప్రైవేటు బస్టాండ్ (APSRTC బస్టాండ్ మినహా) మరియు 3) జంతు వధశాల నందు రుసుములు వసూలు చేయు హక్కును 28-03-2024వ తేది గురువారం ఉదయం 10:00గం.లకు చంద్రగిరి గ్రామ పంచాయతి కార్యాలయము వద్ద సదరు పంచాయతీ కార్యదర్శి వారిచే లీజు యిచ్చుటకు బహిరంగ వేలము వేయబడును. వేలము నందు హెచ్చు పాటదారులు గ్రామ పంచాయితిచే ఖాయపరచబడిన తదుపరి 7 దినముల లోపు పూర్తి పైకము చెల్లించి మరియు నూటికి రూ.2/- వంతున స్టాంపు డ్యూటీతో రిజిష్టర్ అగ్రిమెంటు చేసుకొన వలయును. మరియు T.D.S., G.S.T. లు చెల్లించి తగు రసీదులు పొందవలయును. అట్లు చేయనియడల వేలమును రద్దు పరచి మరువేలము వేయబడును. సదరు వేలము నందు పాల్గొనువారు వాటి ఎదురుగా తెలిపిన ప్రకారము ధరావత్తు మొత్తమును ముందుగా "పంచాయతి కార్యదర్శి, చంద్రగిరి" వారి పేరిట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వారి డి.డి. (డిమాండ్ డ్రాఫ్ట్) ల రూపములో మాత్రమే చెల్లించి వేలము నందు పాల్గొన వచ్చును. సదరు వేలము నందు పాల్గొను వారు గ్రామపంచాయతికి ఎలాంటి బాకీ ఉండరాదు.

చెల్లించవలసిన ధరావత్తు వివరములు

క్రమ సంఖ్య	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు రూ.
1.	వారపు సంత	9,00,000
2.	ప్రైవేటు బస్టాండు (APSRTC బస్టాండ్ మినహా)	3,00,000
3.	జంతు వధశాల	40,000

షరా: • మిగతా వివరముల మరియు వేలపు షరతులు నియమ నిబంధనల కొరకు కార్యాలయ పని వేళలందు సంప్రదించగలరు.
• సదరు వేలము పాటను ఏదేని కారణము చూపకనే వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు మరియు మరువేలము జరుపుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

సం/- శ్రీ జి.మహేశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1), గ్రామ పంచాయతీ, చంద్రగిరి.

సం. /- శ్రీమతి M. రూప, సర్పంచ్, గ్రామ పంచాయతీ, చంద్రగిరి.